# ★ అన్వేషణ ★

శ్రీ
కామరాజు
సూర్యనారాయణ రావు.




మేడమీద రెండు గదు లున్నాయి. ఒక గదిలో 'ఎనాటమీ బుక్సు,' మెడికల్ మాగజిన్సు! అవి యివి అరణ్యంలాగు రూమంతా వెదచల్లబడి వున్నాయి. రెండోది విశాలమైంది. దాంట్లో మధ్య ఒక కారమ్స్ టేబిల్, నాలుగువైపులా నాలుగు కుర్చీలు. వాటి ప్రక్కనవున్న ఈజీచైరులో ప్రమీల, తన నల్లటి పొడుగాటి జడను, బుజాల మీదుగా ముందుకు వేసి, చేతితో సవరిస్తూ కూచుంది. రామం 'స్ట్రైకర్' చేత్తో పట్టుకుని పక్కనవున్న 'టీ ట్రే' లోంచి ఒక కప్పు టీని స్పూనుతో కదలిస్తూ,

'ఏమిటట్లా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు దేవిగారు?' అంటూ రెండో కప్పులో టీని నింపాడు.

ప్రమీల ఒక చిరునవ్వు కనపరచి, మళ్లా ఎప్పటి సీరియస్ నెస్ తోటి చూస్తూ,

'రామం, నువ్వు, నన్నెంతో ప్రేమించావని నమ్మాను. నీకంటె నాకీ ప్రపంచంలో ప్రియమైందేదీ లేదని నాతో ఎన్నిసార్లు చెప్పలేదు నువ్వు?

'అట్లాంటి నువ్వు...నన్ను...యీ...స్థితిలో వొదిలిపెట్టి వెళ్తాననటానికి నోరెట్లా వచ్చింది? బ్రతిమాలుతాను రామం! వినవూ...నాకోసం...నీవు ప్రేమించా నన్న నీ దేవికోసం...ఒక పదిరోజులు

ఓపిక పట్టలేవూ? రామం!...నీవు వెళ్ళిపోతే ప్రతి రోజూ యుగయుగాల్లాగ ఎట్లా గడపడం? దేన్ని చూసినా, రామం నీ రూపం అట్లా జ్ఞాపకం వస్తూంటుందే నాకు! తరువాత చెపితే మాత్రం ఒప్పుకోరా మీ నాన్నగారు,- యిప్పుడు ఒప్పుకునేవారు?'

అని కుర్చీని దగ్గరగా లాగుకొని, రామం మొఖంమీద ఉద్భవించే ముత్యాల్లాంటి స్వేదజలాన్ని తుడుస్తూ,

'ఇంతవరకూ, మీ నాన్నగారి, అభిప్రాయాలతో పని లేదన్న, నిరంకుశత్వా న్ననుభవించే, నీ స్వేచ్ఛ...యివాళ...యింత తుచ్ఛమైన శృంఖలాల్లో పడిపోతుందనుకోలేదు రామం! ఇప్పుడు...యింతపని అయాక...నన్ను గోతిలో దించి,'

అని గభాలని కుర్చీవెనక్కి ఆనుకుంటూ, తన శూన్యదృక్కులతో, కిటికీ అవతల నున్న నీలి విశాలాన్ని చూస్తూ తిరిగి,

'మీ నాన్నగారు ఒప్పుకో లేకపోతే...నన్ను ...అబ్బా! ఏమిటీ నరకం...ఒదిలేస్తావా రామం? ఏమీ అనుకోవద్దు క్షమించు రామం, తప్పే మైనా వుంటే. హృద్వేగంలో, భావాలన్నీ, ఉబికి వస్తున్నాయి. వద్దు రామం వెళ్ళొద్దు. సెలవులైం తరువాత, నేనుకూడా వస్తాను. రామం వినవూ?'

అని అతని చెమటలు గమ్మిన చిన్న గడ్డాన్ని తన సన్నని పొడుగాటి చేతులతో పట్టుకొని, ముఖాన్ని తన వైపుకు త్రిప్పింది ప్రమీల. అతని కళ్లలో, ఎక్కడ నుంచో- దూరదూరాలనుంచి వచ్చే విచారాన్ని సూచిస్తూ చెమ్మగిల్లినవి. పెదిమలు కదలుతూన్నాయి. కాని వణకుతూన్న ఆమె చేతుల్ని, గట్టిగా ఒత్తుతూ,

'ప్రమీల, నన్ను నమ్మవు నువ్వు? నేను మా నాన్నగారితో మాట్లాడి...ఒప్పించి... మూడు రోజుల్లో తిరిగి వస్తాను. నీతో గడిపే ప్రతిక్షణమూ... నిర్విచారంగా, ఆనందంతో గడపాలని కోరిక. ఈలాంటి ఆలోచనలతో హృదయం కొట్టుకుంటూ వుంటే...నా కాలం వృధా చేయలే'

నంటూ చల్లారిపోయిన టీ కప్పుని ప్రమీల కొకటిచ్చి తా నొకటి ఖాళీ చేసాడు.

సామానంతా సర్ది, మెయిలుకు పోదామని సిద్ధమవుతున్నాడు రామం. ప్రమీల హృదయంలో గాలిదుమారం రేగింది. నిర్మలమైన వెన్నెల్లో గడిపే హృదయానికి, దట్టమైన మేఘాలు క్రమ్మాయి. మబ్బులు మళ్లీ విడిచేటట్టు లేదు. ప్రమీల కన్నుకొలకుల్లోంచి జలప్రవాహం బయలుదేరింది. ఆ క్షణాలు ఎట్లా గడిచాయో! 'స్త్రీ ఒట్టి అమాయకత్వం. పాపం మెరిసేవన్నీ మణు లనుకుంటుంది. లోకం అంతా, తనకు మల్లే, సజావుగా వుంటుందనుకుంటుంది!' అని కొంచెం సేపు తన మూర్ఖత్వాన్ని దూషించింది. కాని భావి జీవితంలో మార్గాలేమీ కనుపించడం లేదు అంతా అంధకారం...నిరాశ...చంచలత్వం...యింతే... ఆమె దృక్పథంలో! రామం వెళ్తూంటే అతని నాజుకైన స్వరూపం ఆమె హృదయంలో కంపించింది. కనిపించే వరకుచూసి...చూ...సి... తన గదికి వెళ్ళిపోయింది ప్రమీల.

★

స్త్రీ హృదయం చాలా ప్రశాంతమైంది. నిర్మలమై చంచలం లేని, అతి సున్నితమైన, స్త్రీయొక్క ప్రేమను పురుషుడు చాలా శ్రమపడినా అర్థంచేసుకోలేడు. అంత గభీరమైంది స్త్రీ మనసు! తన ప్రేమకై సర్వం అర్పిస్తుంది. ఆత్మార్పణం చేస్తుంది స్త్రీ. పురుష హృదయం దానికి సంపూర్తిగా ఒప్పుకోదు. పురుషుడు ఆత్మగౌరవం కోసం జీవితం ధారపోస్తాడు. స్త్రీలో దేవత్వం ఎక్కువుంది- పురుషుల్లో కన్నా!

★

ప్రమీల వాడిపోయిన జాజిపూవులాగు తన లావణ్యాన్నంతా గోల్పోయిందా రెండు వారాల్లో. దాంట్లో ఆశ్చర్య మేమీలేదు. జోన్- ఆఫ్- ఆర్కుని జైలులో బంధిస్తే, యిరవై యేళ్ల యవ్వనంతో మెరిసే బంగారు జుట్టంతా, ఒక్కమారు తెల్లబడిపోయిందిట- విచారంచేత ఒక్క రాత్రిలో. చిందరవందరగా మొగముపై వాలేజుట్టూ, ...నిద్రలేక కొంచెం ఎఱ్ఱ వారిన కండ్లూ... బరువు కనురెప్పలు...ఆమెలో ఒక నూతనా వేశాన్ని కలుగజేశాయి...ఆశ!...ఆశ!!... తన రామం...తనకు ద్రోహం చేస్తాడా? ఒక్కసారి తన హృదయంలోని రామం హృద్వీణ మీటాడు. కాని మరుక్షణం నిరాశ!...ఏవైపు చూచినా నిరాశే! మగవారు ఎంతమందిని మోసంచేయలేదు- అమాయిక స్త్రీలనుచేసి? రామం ఆమె హృదయంలో మసకల్లో మాయమై తీరని తమోమయాన్ని కల్పించాడు. తన యిష్టంలేకుండా, బ్రతిమాలినాకూడా లెక్కచేయ కుండా, పోయాడే...అతని మా టెట్లా నమ్మడం? ఒక్కసారి అద్దం ముందరకుపోయి నిల్చుంది. తన శుష్కించిపోయిన శరీరాన్ని చూసి ఆశ్చర్య పోయింది. దానికేం విచారంలేదు. తన కళ్ళలో, జీవితజ్యోతి గాలిలో వూగులాడే దీపంలాగ కదలుతూ...ఆరి... పోతూ కనిపించింది. ఇంతలో ఆమె భావనా ప్రపంచం లోంచి ఒక్కమారు వులిక్కిపడి లేచింది.

'పోస్టు' అనిచెప్పి ఒక కవరుయిచ్చి వెళ్ళి పోయాడతను.

'ఎవరు? తన రామం' అబ్బ ఎంత సంతోషం! మాట తప్పడు. వెళ్ళటంతోటే వ్రాస్తానన్నాడు' అంటూ ఆదుర్దాగా తన ప్రక్కమీద చదువుతూంది. ఒకమారైంది. ఏమీ అర్థంకాలేదు. తిరిగి చదివింది... ఎన్నిసార్లు చదివిందోదాన్ని! దుఃఖం క్రుంగించేస్తోంది. చేతులోని ఉత్తరం అట్లాగే వణకి క్రిందపడిపోయింది తన ప్రశంశ ఏమీ లేనట్టుగా! కళ్ళనిండా నీళ్లు తిరిగాయి. ప్రపంచం అంతా అంధకారమే ఆమెకి తను ఏం చేస్తోందో తనకే తెలియదు. కాని "టేబిల్" మీద ఫోటోలోని రామం యిదంతా చూస్తూనే వున్నాడు. కళ్లల్లోకి కళ్లుపెట్టి చూసింది. అతని అమాయకపు చూపులలోంచి నిర్మలమైన, ప్రేమ ద్రుక్కులు రాలు తున్నాయి. రామం...తనరామాన్ని ... వాళ్లందరూ... నిర్బంధించి...అబ్బా... ఎన్నిచెప్పినా వినకుండా,... ఎంత కష్టపెట్టారో? నన్ను ప్రేమించానని చెప్పినా, .. నాస్థితి...అర్థం చేసుకోకుండా...అతని హృదయాన్ని ...పొడిచి... అబ్బా... బాధించి... లేకపోతే...నా రామం... వొప్పుకుంటాడా? ప్రపంచంలో మా అనంతప్రేమను... తెలుసుకునే ఒక్క.... ఒక్క... దయార్ద్ర హృదయం లేకపోయింది. ఏదీ నిజమైన ప్రేమకు తావు యీ ప్రపంచంలో? మనసిచ్చిన తరువాత వివాహ మవుతుంది. కాని వివాహమైన తరువాత ...మనసివ్వడం కేవలం నిర్బంధం...కొంతమంది విష యాల్లో! పెట్టెలో, రామం, అయిదేళ్ళనుంచీ,- వేసం కాలపు సెలవులలో వాళ్ల వూరినుంచి వ్రాసిన వుత్తరా లన్నీ చదివింది. ఆ ప్రోత్సాహం, ఆ న్యూనత,...ఆ ఆనందం ఆ నిర్మలమైన ప్రేమను, ఈ ప్రపంచం ఈ సంఘం ఎరుగలేక పోయింది కొంచెం జ్వరం వచ్చిం దనగానే, ఆందోళనచే, తన ప్రమీల తనకు దక్కు తుందో లేదో అని, కళ్లు జలపూరితాలైనా, వుత్సాహం కలిగేటట్టు మాట్లాడే తన రామం... అలాంటి తన రామాన్ని ఎట్లా మరవగలదు తన హృదయం?... నా...నా రామం హృదయాన్ని... యింకొకతె...ఎవరో పద్మట తన హక్కులాగున... ఆక్రమించుకుంటే...అబ్బా...తనెట్లా సహిస్తుంది? పాపం...తన రామం...ఎంత హృదయం బ్రద్దలుచేసి చూపించినా...పద్మను బలవంతంగా తోసి...ఆమెను ప్రేమించ మంటే... సహిస్తాడా తన రామం?

ప్రమీలకు కాలప్రమేయం లేదు. ఆలోచనా మగ్నయై, తన ప్రక్కమీద పడివుంది. జీవస్ఫూర్తి

చెందిన విచారదేవేమో! ఎన్ని ఎన్ని క్షణాలు, యుగాల్లాగ నడిచాయో, పాపమా విచారంచేత ఉద్రిక్తమై, అదరిపడే ఆమె హృదయంమీద పన్నెండు గంటలు కొట్టింది గడియారము మామూలుగా; అంతవరకూ భోజనంలేదు. కొంచెం "టీ"తాగి ఆరోజుకి చాలనుకుంది.

మళ్లీ ఆలోచన...తన ప్రత్యక్ష పరిస్థితి... అమ్మో! ఎంత భయంగా కనిపిస్తోంది. అందరూ ఆమెనుచూచి నవ్వి ఎగతాళి చేయరూ? అంతటితో పోనిస్తుందా లోకం? అధమాధమంగా చేసి, ఆ జీవి అట్లా శుష్కించి, అవమానంలో కృశించి, జీర్ణించి పోవాలిగాని! ఏడీ దేముడనే వాడొకడుంటే, ప్రేమకు ప్రాధాన్యమివ్వకుండా, యిలాంటి రాక్షసకృత్యాలు జరిగే...యీ మానవ సంఘాన్నంతా నిరూపంగా చేసేయడూ? కొన్ని కొన్ని పశువుల్లోకూడా, నీతి నియమం, ప్రేమా అని వున్నాయి. భార్యా భర్తలలో చాలిస్తుంది! మానవుల్లో, అందులోనూ, భగవత్ సృష్టిలో ప్రాధాన్యం పొందే మానవజాతిలో, ప్రేమకు ప్రాధాన్యంలేదు!! వుంటే...వుంటే... రామం నాన్నగారు...బలవంతంగా... చెప్పినా వినకుండా... రాక్షసంగా పద్మను వివాహం చేస్తాడా? రామం...నేను... గర్భవతిని...హృదయం...వ్యాకులత చేయలేక, ముందే తెలియజేయలేకపోయాడు.

తనుచేసిన పాపం ఏమిటి? తనెందుకు... ఈనరకయాతన అనుభవించాలి? నమ్మి, హృదయాన్నిచ్చి, సర్వం అర్పించి, నిశ్చలంగా ప్రేమించింది; అంతే అదే పాపమై, దాన్నే శూలంగా త్రిప్పి పొడుస్తోంది లోకం?

ఆమె గది కిటికీ, అస్తమసూర్యుని సంధ్యారాగాన్ని పడనిచ్చింది, ఆమె వాడిపోయిన చెక్కిళ్ళమీద ఆమె బెదరు కనురెప్పలగుండా, రక్తజ్యోతిని చిమ్మే బింబానికి తెలియకుండా ప్రాకుతూవచ్చేదీ కిటికీలన్నీ చూస్తోంది. తన జీవితంలో గూడా సంధ్యాసమయం సమీపించింది. అంధకారం ప్రాకుతోంది. అస్తమ సూర్యునిలాగ...తను గూడా...అస్తమిస్తే... అబ్బా ఎంత బాగుంటుంది!...ఈ లోకం...అవమానం...నీచపు బ్రతుకు...దుర్భరం!...కాని...కాని అవటువంటి పనిచేయలేదు...అసంభవం...ఇప్పుడు... తన ఆనందబాష్పము...తన ప్రేమా, ఫలము...కూడా లేదు. చేయదు... తన జీవితం గడపాలి...తనకోసం కాకపోయినా. అది నెరవేర్చాలి...విధి...చేతికి తెచ్చుకున్న విధి! అవమానం భరించైనా సరే... బ్రతకాలి...తన ప్రేమ ఫలాన్ని కళ్లార చూసి... చూ...సి... జీవితం...అస్తమిస్తే...ఎంత ఆనందం... ఆ ఆత్మకి!

★

నడిరేయి. ప్రశాంతమైన, ఆ నీలిగగనంలోంచి తారకా మణులు తొంగితొంగి చూస్తున్నాయి. తెల్ల తెల్ల మబ్బులు, శశిరేఖతో నాజూగ్గా దాగుడుమూతలాడుతూ, కనుబొమలు ముడిచిన ఆమె లేత కోపాన్ని చూచి దూరంగా తొలగి పోయాయి.

సూది వేసినా ప్రతిధ్వనించే హాస్పిటల్ కారిడార్లలో,...Shade lights మాత్రం మసక వెల్తురు చిమ్ముతున్నాయి. ఒక్కసారి ఎవరైనా, ఆ సమయంలో ఆ దృశ్యాన్ని చూస్తే, 'ఫిలసాఫిక్ వ్యూస్' ఎన్నో బయల్దేరుతాయి మనో వీధుల్లో! ఎన్ని జీవాలు, అస్వస్థలై, చావుబ్రతుకులలో వూగులాడి, మేల్కొల్పులేని మరణశయ్యల్లో తమ తనువులను త్యజించారో! ఎంతమంది, తమ్ములను మృత్యుముఖాన్నుంచి కాపాడిన ఆనర్సులను, జన్మ జన్మంతా, తలుచుకొని, తలుచుకొని మొక్కుతుంటారో కదా!

ఎక్కడనుంచో...అబ్బా...గర్భ నిర్భేద మయ్యే ఒక మూల్గు...అపారమైన బాధచే బయల్వెడలిన ఆ మూల్గు... నిశ్శబ్దాన్ని భేదిస్తూ ...ఎక్కడనుంచో నరకకూపాల్లోంచి వచ్చే మూల్గు

లాగ...కర్ణకఠోరంగా వుంది. ఆ వార్డులో ఒకమూల, Shade light ప్రక్కన తన రెండుచేతుల్లో ముఖాన్ని కప్పి, ఒక నర్సు కునుకుతీస్తోంది. ప్రక్కన ఓడ్‌హౌసుగారి నావల్ ఒకటి తెరచివుంది. జీవితం అంతా మానవసేవకై ధారపోస్తారు! ఎంత ధన్య జీవులు. విసుగులేకుండా, ఏపనైనా, ఎప్పుడైనా చేసేవోపిక వాళ్లకి వున్నందుకు సంతోషించాలి,... ఉలిక్కిపడిలేచిందా నర్సు...ఆమూల్గు...నిశ్శబ్దాన్ని భేదిస్తూ, హృదయ హృదయాన్ని, అల్లకల్లోలంచేసే ఆ మూల్గుతోటి. గబగబా, పరుగెత్తికెళ్ళి, ప్రమీల ఫాలంమీద చేయిపెట్టింది. జ్వరం తీవ్రంగా వస్తోంది... బాధ—భరింపరాని బాధ—నడుములో నొప్పి...నర్సు త్వరగా ఎవరికో ఫోను చేసింది. పది నిముషాల్లో కారాగిన చప్పుడు. లేడీ డాక్టర్ వచ్చింది. ఫరవా లేదనిచెప్పి...కాన్పయేవరకూ అక్కడవుంది.

అబ్బ, ఒక్కమారు...ఎంత హాయిగావుంది ఆమె ప్రాణం...ఆ బాధలోంచి బయట పడగానే. ఆ రాత్రి తనబిడ్డను ప్రక్కలో చూచింది! అబ్బా... ఎంత ఆనందం! ...ఎంత సౌఖ్యం...అచ్చంగా నత రామం!... ఆ నోరు...చిన్నవంపు,...సొంపుగా విరిగిన ఆ పెదిమల తీరు!...కాదు...కాదు తనే? ఎంత విశాలంగా వున్నాయి. కళ్లు...కనుబొమలు ఎంత నాజూగ్గావున్నయి! ఆ ఫాలం... విశాలమైన ఫాలం...రెండో అచ్చు గుద్దిన తన రామమే సుమా!! అ చిన్ని వేళ్లు...బుల్లి అరచేతులు ఎంత మెత్తగా వున్నాయి తాకితే! తాకితే కందుతున్నాయి కూడా సుమా! పొడుగాటి ముక్కు...అచ్చంగా తనదే... రెండూ కొలిచింది...రెండూ సమంగా లేవు!! ఎంత చిలిపితనం...ఎదీ...ఏదీ...యిన్నాళ్లనుంచీ ఆమెను ముంచి తేల్చిన దుఃఖం? ఈసారి,...ఆమెకు ఏమీచేయ లేదు...తన ప్రేమాంశం...ప్రక్కన వుంటే...లోకం... అవమానం...యింకా దేన్నయినాసరే,...చివరికి మృత్యు వునైనా,...జయించడానికి ప్రయత్నిస్తుంది. అమ్మో యిప్పుడు చావంటే ఎంత భయంగావుంది?

'క్యార్...కార్' మని ఏడ్పు.

ఎంత పట్టుదల!...అంతాతనే... చిన్నప్పుడు తనకు లేదూ??

ఆలోచనలమీద ఆలోచనలు...ఎంత తొందరగా పరుగెత్తుతోంది కాలం. తన పుత్రునిపై చేయివేసి హాయిగా నిద్దర పోయింది. ఎన్నాళ్ల కెన్నాళ్లకో! మాతృ హృదయం ఎంత అల్పసంతోషి...ఎంత తన్మయత్వం రోజులు గడిచాయి కాని మునుపటంత దుర్భరంగాలేవు. తన కుమారుని ప్రతినిముషం అట్లాగే రెప్పవేయ కుండా చూస్తూవుండేది. ఒక్కక్షణమేనా విడవకుండా అతనుచేసే ప్రతిచేష్టకు ఒకొక్క ప్రత్యేక అన్వయాన్ని కల్పించి సంతోషించేది. ఎన్నెన్నిసార్లు ముద్దుపెట్టు కుందో ఆచిన్ని పాపని...తన జీవితంలో జీవం...తన ఆనందంలో ఆనందాన్ని! కాని జాలి...హృదయంలో మారు మూలల్లోంచి చలిలాగ జగజగ వణికిస్తూం టుందామెను అప్పుడప్పుడు. ఆ అమాయకపు పసికూ నకు పితాజీ అంటే ఎవరో తెలియదు...తెలియబోదు కూడాను! హృదయం నీరైపోయేది అట్లాంటి ఆలోచన తలపునకు వచ్చినప్పుడు. కన్నీళ్లుకారేవి. ఆ పాపను చూచినపుడు...చిన్ని చేతుల్ని గాలిలో అటూయిటూ ఆడిస్తూంటే...ఆనందం!...బ్రహ్మానందం!! విచారం అంతా సూర్య కిరణాలముందు మంచు కొండలాగ కరిగి పోయేది.

★

డాక్టరు మరునాడు నాల్గుసారులు 'టెంపరేచర్' చూసింది. మొగము చిట్లించింది. రెండు రోజుల వరకు జ్వరం తగ్గను ఎక్కను—నాలుగో రోజున డబుల్‌న్యుమోనియా అని తేల్చింది. ఆశ అంత కంతకు పోయింది. ప్రమీల చెల్లెలికి టెలిగ్రాం యిచ్చింది డాక్టరు—తక్షణం వచ్చి పిల్లవాణ్ణి తీసుకు వెళ్ళమని.

జ్వరం తీవ్రంగా రాత్రంతా కాసింది. తెల్ల వారగానే విమల వచ్చేసింది. ప్రమీలాకీ ప్రపంచ ధోరణేలేదు కలవరింతలు... సాంధ్యాసామీప్యం... జీవితజ్యోతి...వదలుతు...ఆరిపోతూ...ఒక్కసారి కళ్లు విప్పి విమలను చూసింది. తెలివి వచ్చింది.

'విమలా...దురదృష్ట వంతురాలిని...ఈ పాపని ...నీ...దే...అని...పెంచుకో...నా కడసారి...కోరిక నా సూటు కేసు...వానికి యియ్యి...నా ఆస్తి అంతే... శెలవు...అంటూ తన పాపని ఒక్కసారికి...కడసారి ముద్దు పెట్టుకుంది.

డాక్టరువచ్చి విశ్రాంతి తీసుకొమ్మన్నది ప్రమీలను. శరీరం ఒక్కసారి చల్లబడింది...ఇంక...వకే నిద్ర... అస్తమించింది జీవతం...కాని...తన యిష్టం లేకుండా! విమల తన అక్క M. D. కోర్సు యింత పని చేసింది కదా అని ఏడ్చింది. ఆ పాప ఒక క్షణం క్రింద మాతృదేవి ప్రక్కన...నిద్రపోతున్నాడు... ఇప్పుడో ...దురదృష్ట వంతులలో అధముడు...క్యార్... క్యారు మన్నాడు-ఏదో అర్థమై యేడ్చినట్లు...ఆ చిన్ని చేతులు ఆమె వక్షాన్ని తాకాయి...విగత జీవి ఆమె...జన్మ దరిద్రుడు యీ పాప.

★

ఒక పేద యిల్లు. సమయం రాత్రి తొమ్మిది గంటలు దాటింది. విమల గడపమీద కూచుని, వీధి లోకి చూస్తోంది. బాపుజీ అటూయిటూ, విధీ విరామం, లేకుండా తిరుగుతున్నాడు. నిరంజన్ యింకా యింటికి రాలేదు. 'ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్' అయినా యింతసే పవుతుందా; ప్రమోద్, ప్రభాత్, వాళ్ళందరు వచ్చేశారే" అంటూ ఆలోచనలతో అడుగులు లెక్కపెడుతున్నాడు బాపుజీ. గంట పది కొట్టింది. తలుపుతోసుకుని, బరువుగా చేతులో వున్న పుస్తకాలన్నీ టేబిల్ మీద పారేసి, అవనత వదనంతో కూచున్నాడునిరంజన్. అతని పొడుగాటి లాల్చీ, వదులుగా వున్న లాగూ, చాలా తగిన ట్టున్నాయి. పొడుగ్గా వంపు తిరిగిన అతని కనుబొమలు చాలా తీవ్రంగా దేన్నో ఆలోచిస్తున్నాయి. అతని జుట్టు చిందరవందరగా రేగిపోయింది. కళ్లు తీక్షణంగా రెప్ప వేయకుండా చూస్తున్నాయి.

'నిరంజన్! యింత ఆలశ్య మెందుకైందోయి? నీ 'ప్రైజ్' పుస్తకా లేవి?'

అంటూ ఆ పుస్తకాలన్నీ చూస్తున్నాడు బాపుజీ. రవీంద్రుని 'గీతాంజలి' అతనికి బెంగాలీలో ఫస్టుగా వచ్చినందు కిచ్చారు. ఇంకేవో, టెనిసన్, షేక్స్పియర్, అన్నిటికన్నా ముఖ్యమైంది ఉమర్ ఖయామ్ యింకా చాలా చాలా వున్నాయి.

కాని అతని విచారానికి కారణం వూహించలేక పోయాడు బాపుజీ. చాలా సంతోషా న్ననుభవించ వలసిన ఆ సమయంలో విచారం ఎందుకు? అతని భుజంమీద బాపుజీ తట్టాడు ఒక్కమారు. నిద్రలోంచి లేచినట్లు త్రుళ్లిపడి చూచాడు నిరంజన్ తన ఆలోచనలోంచి.

'బాపుజీ! ఏమి ఆజ్ఞ!

అని చాలా వినయంగా అడిగాడు. బాపుజీ అతనికి పితృ సమానుడు. దానికంటూ ఎక్కువ అతని యందుండే గౌరవం. నిరంజన్ సాధారణంగా ఎవ్వరినీ లెక్కచేయడు. కాని ఒక్కసారి ఒక మనిషిమీద నమ్మకం కుదిరితే, అతన్ని దైవసమానంగా 'గౌరవించి, పూజిస్తాడు.

'నిరంజన్! నీ హృదయంలో కలిగిన విచారానికి కారణం ఏమిటి? నీకు కలిగిన ప్రతి సందేహాన్ని నన్ను అడిగేవాడివే నన్ను,...నీ అంతరాత్మ గాలించి సలహా తీసుకునే వాడివే...నీవు ఎందుకీనాడు దాన్ని దాచి, హృదయంలో కుములుతున్నావు! ఏదో నీ సున్నితమైన మనసుని పీల్చి, పిప్పిజేసే సమస్య ఒకటి బయలుదేరింది. నీకళ్లే దీనికి సాక్షి" అని బాపుజీ, నిరంజన్ తల నిమురుతూ అన్నాడు. నిరంజన్ ఒక్కసారి

తన విశాలమైన బరువు కనురెప్పలను పైకెత్తి చూచాడు.

'బాపుజీ! ఈ నిష్ప్రయోజన జీవనం దేనికి? ప్రతిజీవికి, జీవితంలో ఆశయా లుండాలి. అవి లేకపోతే న్యూనత లేదు. న్యూనతలేక ఆనందంలేదు. నాలో ఆ వుత్సాహం క్షణక్షణ విహీన మౌతోంది. దానికి కారణం...కారణం అడుగుతున్నారు అమాయకంగా. దాన్ని అనుభవించేవాణ్ణి నేనే కాకుండా వినిపించి, మిమ్ములనుకూడా కష్టపెట్టడానికి మనసొప్పదు. కాని పితాజీ ఆజ్ఞ...నేను వచ్చే సంవత్సరం కల్‌కత్తాలో కాలేజీలో చేరాలి...ఈవేళ ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ చేసిన గవర్నరుగారు, వారి సతీమణి యిస్తారట స్కాలర్‌షిప్పు, మా హెడ్ మాస్టర్ గారు......"

గొంతు సవరించుకుంటూ, నిరంజన్, "నా వ్యర్థ జీవితాన్నంతన గవర్నరుగారికి చెప్పారు...నేను ...ఒకప్పుడు...విగతజీవి...మాతాజీ ప్రక్కన...క్యార్ క్యార్‌మని అర్థంకాని ఏడ్పులో అంటూ ఏదో చెప్పబోయి...చెప్పలేక...నా విషాద జీవితగాధను పూర్తి చేశాడు...అబ్బా..."

మాటలన్నీ కంఠంలోంచి వణకుతూన్నాయి. మరల బాపుజీ........మానవసంఘం.........ఎంత దుర్భరమై,...దుస్సహమైన కాలానలం లాంటిదో!! సంఘం...గౌరవం...దేనికి యివన్నీ...మానవుడు తన అంతరాత్మను లెక్కచేయక,...తప్పని తెలిసికూడా,... సోదర మానవులకు ద్రోహం చేసి,...సోదర మానవుడు కూడా మన్నింపలేని పాపాలను- భగవంతుడు అసలే మన్నింపడు...చేసికూడా సంఘంలో గౌరవనీయుడైతే...ఏదీ పాపానికి తగిన శిక్ష!...పాపులను గౌరవనీయులుగా పూజించే...సంఘం..."

అంటూ విసుకు, అసహ్యం చిమ్మే, ఆ కళ్ళతోటి, నిరంజన్ మాట ముగించాడు.

బాపుజీ ఒక్కమారు నిరంజన్‌ని కౌగలించుకుని తన వేడి కన్నీటి చుక్కలను తుడుచుకుంటూ,

"నిరంజన్,...ఈ ప్రపంచంలో న్యాయ న్యాయాలను విచక్షణ చేసే విజ్ఞానం, మానవ సంఘానికి లేదు. కాని సత్యం తనంతటది, కాలప్రమేయం చేత గెలుపొందుతుంది. మానవుడు న్యాయాన్యాయ విచక్షణ చేసే అద్భుత శక్తి కలిగివుంటే అన్యాయం చేయనే చేయడు. అప్పుడు మానవుడు ప్రతిదాన్నీ ప్రకృతీనిర్మితంగా, అంటే సహజ గుణలతో చూస్తాడు. అప్పుడు మానవుడు కూడా దైవసముదే! అది దుర్లభం...మానవుడనే ప్రతి జీవికి! ...ప్రేమ అనే ఆశ, ప్రతి జీవితాన్నీ ఆకర్షిస్తూ లాగుతూంటుంది...కొన్నిటిని డొంకల లోంచి... ముళ్లల్లోంచి...మరికొన్నిటిని...మల్లెపూవుల దారుల్లోంచి—వీటిని బట్టే, మన సుఖ దుఃఖ జీవితాలు నిర్ణయింప బడుతాయి. నీ జీవితంలో...బాగా...ఆలోచిస్తే...ఆశయం ఉంది!...నీకు కూడా నీ పితాజీని... చూడాలని...వుండదూ...అతను చేసిన తప్పును... కాని అతనిని సన్మార్గానికి...అతని ఆత్మకి శాంతిగలుగ చేయటానికి తగిన వాడివి నీవే!...తోటి మానవుడు నరకంలో పడబోతూంటే చూస్తూ వూరుకో గలదా నీ జాతి హృదయం? అటువంటిది...పితాజీని...నరకంలోంచి...రక్షించలేవూ...పశ్చాత్తాపం... హృదయంలోంచి...వస్తే...మానవ హృదయానికి అంతకంటె తగు శిక్ష లేదు...నీ జీవితంలో అదే ఉద్దేశం వుండాలి... నీకు క్రొత్తగా వుంటుంది నిరంజన్ నే చెప్పేదంతా! కాని నిర్మలంగా ఆలోచించు...నీవే మన్నిస్తావుపితాజీని...

★

నిరంజన్ చూసేవాళ్లకు చాలాక్రొత్తగా కనిపిస్తాడు. చాలా మితభాషి. ఎప్పుడూ అతనికళ్లు ఆలోచనలతోకూడిన భావాలని చూపిస్తూండేవి. అతని విశాలమైన బరువు కనురెప్పలు, దూర దూరాలనుంచి

కనబడే, విచారపు నీడలు మరుగుచేస్తుండేవి. స్నేహితులా చాలాతక్కువ. చూచేవాళ్లందరికి అతనితో మాట్లాడాలని చాలా సరదా పడతారు. కాని యితను సరిగ్గా కావలసిందేదో చెప్పి మౌనత్వాన్ని స్వీకరించేవాడు. కాలేజీలో ప్రొఫెసర్సుకూడా ఆశ్చర్యపోయేవారు అతని యీవింత చర్యకు! ఎల్లప్పుడూ ఏకాంతంగా కూర్చుని దేన్నో ఆలోచిస్తూండే వాడు. ఇవన్నీ తెలుసుకోవాలంటే అతనికి సంఘంమీద ఉండే అభిప్రాయాలు తెలుసుకోవాలి ముందు.

పాపంచేసే ప్రతివాడూ, తన ఆత్మను...తన మంచినికోరే అంతరాత్మను చంపుకుంటాడు. ధనం కూడబెడుతాడు. సంఘం గౌరవిస్తుంది. సంఘానికి వీడెట్లా ధనం గడించినాసరే లెక్కలేదు...ధనం...గౌరవం సంఘంలో!! స్వేచ్ఛ అనుభవిద్దామని మనవాళ్లుకోరనూలేరు...ఒకవేళ యిచ్చినా అనుభవించనూలేరు...ఎవరో ఒకరు యిది నీకు మంచిదిరా అని 'డిక్టేటు' చేస్తూండాలి మనవాళ్లందరికీ...అంత సేవకులైపోయాము మనం! సంఘం, నియమాలను నిర్ణయించాలి! మనం వాటిని గుడ్డిగా, అనుకరించాలి!! మన వ్యక్తిత్వాన్ని చంపేసుకుంటున్నాం. అదీ, మనకు తెలియకుండా? సంఘం అంటే యివీ అభిప్రాయాలు అతనికి.

అతను చాలా కష్టకాలం గడపబట్టి మనిష్యులను చూస్తే అసహ్యం అని వూహించుకునేవారు అతన్ని తెలిసినవాళ్లు. ఇప్పు డతనికి 21 ఏళ్ళు వుండవచ్చును.

ఇప్పుడు అతని జీవితంలో సరియైన స్నేహితుడు దొరికినాడు. కాలేజీ వదలటంతోటే బాబు దగ్గిరకి యితను వెళ్లటమో, లేక అతను యితనిదగ్గిరకి రావడమో జరుగుతూండేది. ఇద్దరికి సంఘాన్ని చూస్తే అరికాలుమంట. ఇద్దరూ ఏకాంతంగా ఎవ్వరూ కనబడని ప్రదేశాల్లో...గంటలకొలదీ మాట్లాడేవారు, నిరంజన్ ఉన్నతభావాలు విని డాక్టరుబాబు ఆనందించేవాడు ఎదలో. ఒకరితో ఒకరికి దాచవలిసిన సంగతులు లేవు. కాని...బాబు...సంగతివేరు...తనలో కలిగే మార్పులను కనుపింప జేసేవాడు కాడు.

★

డాక్టరుబాబుకి వయస్సు 45 పైనే వుంటాయి. నెరసిపోయినక్రాపు...కళ్లకు రిమ్‌లెస్ స్పెక్ట్స్, అంచు దోవతిని బంగాళీ పద్ధతినికట్టి...వొదులుగా వుండే సిల్కులాల్చీ...కుడిచేతికి బంగారు చైనుతో ఫేవర్‌లూబా వాచీ...కాళ్లకు బర్మాస్లిపుర్సు...యివన్నింటితోటి చాలా నవీను డనిపిస్తాడు. పక్కజేబులోంచి తెల్లటి కర్చీఫ్‌ని తీసి ముఖం తుడుచుకుని, 'రివాల్వింగ్' చైరులో, వాన ఎప్పుడు తగ్గుతుందా అని ఆలోచిస్తున్నాడు. తగ్గితే నిరంజన్ దగ్గిరికి వెళ్లాలని ఉద్దేశం. చాలా రోజులైందిచూసి.

నిరంజన్, బెంగాలీకవి అనికథకుడని యితనికి పరిచయం గలుగచేశాడు బాబు స్నేహితుడు. బాబు బెంగాల్‌కవి అంటే నెత్తినపెట్టుకుంటాడు. అతనితో గంటలకొలది మాట్లాడినా విసు గనిపించదు. అతని ఉద్దేశాలు, విని బాబు ఆశ్చర్యపోయేవాడు. నిరంజన్‌ని చూట్టంతోటే బాబుకి... ఏదో... చాలకాలనుంచి చూడక...ఒక్కసారి చూసిన ముఖంలావుంది. ఎవరో అతని కళ్లముందు మసకమసకల్లో మాయమౌతున్నట్లనిపించింది. నిరంజన్ ముఖంలో...పోల్చుకోలేని పోలికలు...అయినా బాగా తానెరిగినవే...కనిపించాయి. ఎందుకునో, అతనంటే హృదయం ఆనందించేది. చెప్పలేని, భావాలు రేగేవి మనస్సులో. ఆ ఆవేదన ఆ ఆనందంతోటి,... చంద్రుణ్ణిచూచిన సముద్రునిలాగ...హృదయం పొంగిపోయేది భావాలతోటి. ఏమైనాగాని నిరంజన్‌లో అందరినీ ఆకర్షించే ప్రబలమైన అద్భుతశక్తివుంది. కాని ఆకర్షింపబడే వాళ్లందరూ...బాబు మాదిరిగా...అదే భావాలతో వున్నారా?...ఏమో!

వాన అంతకంతకు అధికమై, ఆ కారుమేఘాల లోంచి 'జోరు'న కురుస్తోంది. మధ్యమధ్య లోకం అంతా దద్దరించి పోయేలాగు మేఘ గర్జనలు వినబడుతున్నాయి. చలిగాలి కిటికీలోగుండా గదిలోకి పల్చటి చినుకులతో ప్రవేశించి బల్లమీద ఉన్న పుస్తకాలతోటి పటపటమని శబ్దం చేస్తూంది. వాన యిప్పటిలో తగ్గేట్టు లేదు. లేచి ఒక్కసారి బైటకువచ్చి చూచాడు...అబ్బా! కళ్ళు మిరుమిట్లు గొలిపేటట్టు–ఆకారుమేఘాలమధ్య శంపాలతాంగివంపులు తిరిగే తన నాజూకైన శరీరాన్ని మెరిపిస్తోంది!! ఆ తెల్లటి జుట్టు గాలిలో రేగి ముఖంమీద వూగుతోంది. చివరకెట్లాగో ధైర్యంచేసి తన కారులో బయలుదేరాడు బాబు. ఆ వీధిలో పోతూంటే...చల్లటి ఈదురుగాలి ...వాన... మెరుపులు... ఉరుములు... ప్రకృతి నాడు ప్రళయనాట్యం చేస్తోంది. వీధుల్లోచెట్లు వేళ్లతో సహా పెకలించుకొని, దారిలో అడ్డంగా పడిపోయాయి. పొడుగాటిచెట్లు'గాలిలో 'జివ్వు' 'జివ్వు'మని వూగుతూ విరుగుతాయేమోనన్నట్లున్నాయి. బాబు కారాపి నిరంజన్ గదిదగ్గిరకు వెళ్లాడు.

తలుపు దగ్గరగావేసివుంది. తీసుకొని లోపలికి పోయి, ఖాళీగావున్న మంచంమీద కూచున్నాడు. నిరంజన్ ఈజీచైరులో కూచుని, కిటికీ అవతల రేగే ఆ తుపాను చూస్తున్నాడు. చేతిలో, ఒక ఫోటో వణుకుతూంది. బాబువచ్చిన సంగతీ తెలియదు. బాబు నెమ్మదిగా నిరంజన్ భుజంమీదతట్టి...

'నిరంజన్'

'బాబూ! మీరా? క్షమించండి...ఎదో మనసు అన్యథావుండి...చూడలేదు మీరు వచ్చింది' తన చేతులోవున్న ఫోటోని బల్లమీద బోర్లాపెట్టి అప్రమేయంగా కారే కన్నీటికాల్వలను తుడుచుకుంటూన్నాడు. 'నిరంజన్...ఏమిటిది? ఏం జరిగింది?' అని ఆదుర్దాగా అడుగుతూ బల్లమీదవున్న ఫోటోని చేత్తో పట్టుకున్నాడు బాబుచూశాడు...మళ్లా... ఆ కొంచెం నెరిసిపోయిన కనుబొమలు తీక్షణంగా ముడివడిపోయినవి. ఫోటో వణకడం మొదలుపెట్టింది చేతిలో. దానినితీసి బల్లమీద పెట్టాడు. మళ్లా అదేచూపు... ఫోటోవైపు... నిరంజన్‌వైపు, బల్లమీదవున్న అద్దంవైపు...తన కళ్లు తను నమ్మలేకపోయాడు. ముఖంమీద చెమటలు క్రమ్మాయి. స్పెక్ట్సుతీసి జేబురుమాలుతో తుడుస్తూ...నిరంజన్ వైపు ..అతను కిటికీలోగుండా తుపాను చూస్తూంటే... ప్రమీల...తను వెళ్లేటప్పుడు...చివరసారి వదిలిపెట్టి వచ్చినపుడు... ఈజీచైరులో... కూచుని...నల్లటి... పొడుగాటి జడను... ఆలోచనలమీద ఆలోచనలు హృద్వేగం అధికమై–అతి వేగంగా, ఆప శక్యంగాకుండా పరుగెత్తుతోంది. నిరంజన్ ఆ నీలికన్నుకొలకులలోంచి నిరాశాంకిత భాష్పములు ఒక్కొక్కటీ రాలుతున్నాయి.

మాటలు తడబడుతూ, వణుకుతూ, బాబు 'నిరంజన్...ఎవరిదీ ఫోటో?"

"మాతాజీ!... మాతాజీ... మా...తా...జీ!!" అంటూ రెండుఅరిచేతుల్లో ముఖాన్ని కప్పి వెక్కివెక్కి హృదయం కరిగిపోయేటట్టు ఏడుస్తున్నాడు.

బాబుకీ ప్రపంచంధోరణే లేదు. ప్రమీల ...నిరంజన్...తన పుత్రుడు...అబ్బా...యిప్పుడు నిరంజనకవి...ఆ స్తితిలో...ఏమస్తూంటే...ఉన్మాదం... క్రోధం ...తన్నుచూస్తే...అసహ్యం...విచారం... పశ్చాత్తాపం ...రక్త జ్యోతిని చిమ్మే అతని తీక్షణమైన చూపుల్లో అన్ని భావాలు నిప్పుకణాల్లాగ రాలుతున్నాయి. ఒక్కసారి,...తన హృదయం వేయిముక్కలుగా పగిలిపోకూడదూ...అబ్బా...ఉన్మాదంలో...ఆనందం...భరింపలేదు...నిరంజన్ ఏవుడు.

'నిరంజన... ఏమిటీ... యిదంతా? ఎందుకీ విధంగా........?"

'బాబూ నా విషాదజీవితం తెలియదు మీకు ......' అంటూ తన ఆజన్మగాథంతా వణుకుతూ...న్న

పెదవులతో చెప్పాడు .. 'మాతాజీ!... ఆపదం... ఆ మాధుర్యం...లేదు... ఈ దరిద్రాధముడికి" యిదే రోజున 22 ఏళ్ళక్రింద మాతాజీ...మరణించింది. ధైర్యం, కోపం అసహ్యం...ఆ చూపులలో మెరుస్తున్నాయి. కిటికీలోంచి వచ్చే...ఆ చలిగాలిలో అతని వెంట్రుకలు చెప్పిన మాట వినకుండా వూగుతున్నాయి.

'బాబూ. నాకు పితాజీ...అంటే గౌరవం లేదు ...వుండటానికి అవకాశం కూడా లేదు...నన్ను దిక్కు లేని వా ని గా...చేసి మా తా జీ ని ... మోసం...అచ్చంగా...ద్రోహం చేసి...ఛీ...నమ్మించి తన పశుత్వాన్ని తీర్చుకుని...' నిరజంన్ మాట గొంతులో ఆగిపోయింది. తిరిగి గొంతు సర్దుకుని...

"సంఘంలో ... ధనం వుండడం చేత...గౌరవం పొందుతూండవచ్చు. మీరే నా స్థితిలో వుంటే... నా దగ్గరవున్న...అతను వ్రాసిన Letters...Photo లతోటి...సంఘంలో, అతను అనుభవించే గౌరవాన్ని, హిమాలయపర్వత శిఖరాన్నత్యాన్నుంచి ఒక్కసారి పాతాళ లోకంలోని గర్భకుహరాల్లోకి...త్రోసి వేయరూ? ...కాని...కాని...కాని...అందుకనే...నేను నా జన్మకథను ఎవరికి చెప్పి మనసు నొ ప్పిం ప ను. నా మూలంగా మీరు...అనవసరంగా..."

బాబుకు తల తిరుగుతోంది...'పితాజీ...గౌరవం లేదు...వుండడానికి అవకాశం లేదు' అవే, అతని చెవుల్లో మారుమ్రోగుతున్నాయి...కళ్లు జారుతున్నాయి...తిరిగి సద్దుకుంటూ "లేదు,...లేదు... చెప్పండి...మీ జీవితంలో విషాదం...నా కనుపాపలోంచి కన్నీరుగా వస్తోంది... చెప్పండి...తరువాత?"

'నా జీవితంలో...ఒక్కసారి...పితాజీని కలుసుకుని...అతను చేసిన పని...ఏవిధంగా పరిణమించిందో...చూపి అతని హృదయాన్ని నరకంలోంచి... సంఘాభిమానంలోంది...విడిచేయుటమే నా జీవితోద్దేశం...

వాన అధికమైంది. రాత్రి తొమ్మిది దాటిందప్పుడే; కాని ఈ ప్రపంచంలో లేనివాళ్ళకి కాల ప్రశంశ ఎందుకు?

'నిరంజన్...విచారించి...ప్రయోజనం లేదు. నేను రేపు వస్తా...నమస్కారం...అని వెళ్లాడు. కారు వెళ్లిపోయింది...ఆ గాలిలో వానలో!

రామం తండ్రి చనిపోయినప్పటినుంచి, ప్రాక్టీసు కలకత్తాకు మార్చాడు. అతనికి తెలిసిన వాళ్లందరు అతన్ని డాక్టరుబాబూ అని పిలిచేవారు. కలకత్తాలోనే తనువున్న యిల్లు కొనేసి, పూలతోట తోటి' తీగెలతోటి నింపాడు. కాని రామం జీవితం ఒక విషాద గాధలా అయింది. తను మనసార ప్రేమించిన ప్రమీల దగ్గిరనుంచి, దూరంగాచేసింది సంఘం! తనట్లా శుష్కజీవితాన్ని ఆనందరహితంగా గడుపుతూంటే సహించింది లోకం. ప్రమీలకు బదులుగా పద్మను ప్రేమించమని తండ్రి అగ్నిసాక్షిగా వివాహంచేసాడు, కాని... ప్రేమించలేడు పద్మను. పద్మతో తాను మనసార తన ప్రణయ విషాదగాధను చెప్పుదామని ఎన్నోసార్లు ప్రయత్నంచేసాడు. కాని విఫలుడైనాడు. తన కాలేజి రోజుల్లో... ప్రమీలను...వివాహంచేసుకొని......ఆనందంగా...యింకేమేమో, గాలిలో మేడలు కట్టాడు. అవన్నీ యిప్పుడు గగన కుసుమాలో, అందరాని, తలపరానివై, హృదయభారాన్ని కలుగచేసాయి. ప్రమీల తనను నమ్మింది. హృదయాన్నించి ప్రేమిందించి... తాను విషపాత్రను అందిచ్చాడు దానికి బదులుగా! పద్మ తనను నిష్కళంకంగా అమాయకంగా ప్రేమిస్తోంది. ఆమె ప్రేమకు అనర్హుడు. పద్మకేం తెలుసు పాపం! తనకు మల్లేనే అమాయకు డనుకుంది. కాని...రామం అనర్హుడు. అది అతని అంతరాత్మకు తెలుసు. అతని జీవితం అంతా పూవుపూవుకీ వ్రాలే తుమ్మెదలా గడచింది. అతని హృదయంలో ప్రతి అణువుకూడా ప్రమీల నామాన్ని స్మరిస్తూంటుంది! తనేమీ ఎరగ

నట్టు పద్మను ప్రేమించలేదు నిష్కపటంగా. పద్మను చూస్తే అతని హృదయం తరుక్కుని పోయేది. ఆమె యింకెవరినైనా వివాహం మాడివుంటే యింత కన్న వెయ్యిరెట్లు సౌఖ్యంగా జీవితం గడిపేదనుకునే వాడు. అతని హృదయవేదన...అంధకారంలో వెదుకుతూంటేది తన ప్రమీలకోరకు. ఇంత విశాల ప్రపంచంలో అతని భావాల నర్థం చేసుకునే ఒక్క హృదయం లేదు. అతనికి జీవితంలో కావలసినవన్నీ ఉన్నాయి ఒక్క ఆనందం తప్ప. బంగారు పంజరంలోని చిలుక లాగు స్వేచ్ఛ లేకపోయినా, స్వేచ్ఛ అంటే ఏమిటో తెలుసు. ప్రమీల తోటి జీవనంలోని మాధుర్యం తెలుసు అతని హృదయానికి!

ప్రమీల చనిపోయిందని అతనికి లక్నోలో చెప్పారు. ఆమె పుత్రుడు...పినతల్లి దగ్గిర వున్నాడని...ఒకస్త్రీ అకాల మరణానికి కారణం తనే...అతనికి లోకం అంతా అంధకారమే.

కాని నిరంజన్ స్నేహం కలిగినప్పటినుంచి అతను తన పూర్వగాధను మరచిపోయి, అతన్నిచూసి ఆనందించటంతోటి సరిపోయిందీతని జీవితం!

రాత్రి అతను యింటికివచ్చే టప్పటికి చాలా రాత్రి గడచింది. ఒకే ఆలోచన తల బ్రద్దలయ్యేట్టు. దానికి ‹గినట్లు బయటకూడా తుపానురేగి అంతకంతకు అధికమైంది. అతనికి ప్రతిమూలనుంచి 'పితాజీ...అంటే గౌరవంలేదు...వుండడానికి అవకాశంకూడ లేదు"అని వినబడుతూన్నది జీవచ్ఛవంలాగ తన రూమ్‌లో కుర్చీలో కూచునివున్నాడు. ప్రపంచంఅంతా మాయగా కనుపించింది. అతని చేసినపనికి తనకే అసహ్యం కల్గింది. ఈనాటికి,...అతని పుత్రుణ్ణిచూసి......ఆనందించాడు...కాని...అతని ఆత్మకు శాంతి లేదు. అతను నిరంజన్ తన పుత్రుడంటే సంఘం వొప్పుకుంటుందీ? సంఘం ఒప్పుకుంటేం, ఒప్పుకోకపోతే నేం అతనికి, అతనిఆత్మ నిరంజన్‌ని పుత్రుడు గావించుకున్న తరువాత. ప్రమీల అతని కళ్ళముందు కన్పించి మళ్లా మాయమైంది. తిరిగి..."నిరంజన్ ' రెండు అరచేతుల్లో మొఖం కప్పుకొని...మాతాజీ..." అంటూ కనిపించాడు.

ప్రభాత దీపకళికీనాడు ప్రాముఖ్యంలేదు. ఆకాశమంతా నల్లని దట్టమైన మేఘాలు బయటకైనా తొంగి చూట్టానికైనా వీలులేని 'జోరు'నవాన... ఈదురుగాలి. వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. సాయంకాలం ఆరు గంటలవరకూ, రామం ఏదో తీక్షణంగా ఆలోచిస్తున్నాడు. చివరికి అతని ముఖంలో ఒక మొండి ధైర్యం కూర్చుకున్నాడు. సాయంకాలం...నిరంజన్ దగ్గిరికి బయలుదేరాడు. నడిచి!...అతనిరూమ్ చేరుకునే టప్పటికి బాగా తడిసిపోయాడు. అతని హృదయోద్రేకం అధికమై, అతనుపెట్టేఅడుగడుక్కీ బరువెక్కుతోంది. నిరంజన్ ఏదో చదువుకుంటూన్నాడు...తలుపు తోసుకుని... రేగిపోయిన జుట్టూ...తడిసిపోయిన బట్టలు...వాటిమీద బురదా...బాబుని చూసాడు...నిరంజన్ ఆశ్చర్యపోయి అతనివంక గాబరాపడి చూసి...మాటలురాక అతన్ని కూచోబెట్టాడు. బాబు నిరంజన్ చేతులు రెండూ పట్టుకుని........ అతని కళ్లల్లోకి చూశాడు. నీళ్లు తిరిగాయి ఆ కళ్లల్లో...నిరంజన్‌కి ఏమీ అర్థం కాలేదు బాబు సంగతి...'నిరంజన్...నీ...దౌర్భాగ్యపు...పి-తా...జీ...ని...నేనే...'నామీద గౌరవం నీకు లేకుండా చేసుకున్నది కూడా నేనే...కాలేజి రోజుల్లో చేసిన ఒక పాపం...యింతవరకు...వోపిక పట్టి...వోపిక పట్టి...ఒక్కసారి తన రౌద్రాన్ని చూపించిన అగ్నిపర్వతం లాగ...ఈనాటికి...నా హృదయం భేధించిపోయింది...ఈ బ్రతుకులో శాంతిలేదు...నీవు...నన్ను క్షమిస్తే... నా ఆత్మకు...శాంతి..." అంటూ అతని చేతుల్లో ఒక కాగితం పెట్టి...ఒక్కసారి కౌగలించుకున్నాడు...ఆ కౌగిలిలో...పుత్రప్రేమ...దాని ఆనందం తన జీవితం ఒక్కసారి అనుభవించాడు...అతని రెండు చేతులూ పట్టుకుని...'క్షమాపణ' నాకు...ఆత్మశాంతి... అంటూ హృదయం కరిగేటట్టు చూశాడు... నిరంజన్... ఆ కాగితం విప్పి చదివాడు...బాబుజీ ఆస్తి అంతా...తన పేరట వ్రాశాడు. తలఎత్తి చూచేటప్పటికి బాబు తలుపు తోసుకుని...ఆగాడాంధకారంలో కారు మేఘాల నుంచి కురిసే ఆ వానలో...ఉరుముల్లో...మెరుపుల్లోకి బాబుజీ పరుగెత్తాడు. బాబుజీచేసిన పనికి ప్రకృతి ఆహ్లాదించింది ఆహ్వానించింది తన కౌగిలిలోకి....